# విద్యుత్ ఉద్యోగమేళా

## 2939 ఖాళీల భర్తీకి ఎస్పీడీసీఎల్ నోటిఫికేషన్

- మూడు క్యాటగిరీల్లో ఖాళీల భర్తీకి మూడు నోటిఫికేషన్లు
- అక్టోబర్ 10 నుంచి ఆన్‌లైన్‌లో పూర్తివివరాలు
- సూర్యాపేట జిల్లా మినహా ఇతర జిల్లాల్లో భర్తీకి ఈసీ నుంచి అనుమతి

| పోస్టులు | | |
|---|---|---|
| | జూనియర్ లైన్‌మెన్ | 2,438 |
| | జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ | 477 |
| | జూనియర్ పర్సనల్ ఆఫీసర్ పోస్టులు | 24 |



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ రాష్ట్ర దక్షిణప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ ఎస్పీడీసీఎల్) దసరాకు భారీ ఉద్యోగమేళాను ప్రకటించింది. 2,939 పోస్టుల భారీ భర్తీకి ఎస్పీడీసీఎల్ మూడు నోటిఫికేషన్లు ఇచ్చింది. హుజూర్‌నగర్ ఉపఎన్నికల నేపథ్యంలో కోడ్ అమల్లో ఉండటంతో సూర్యాపేట జిల్లాకు సంబంధించిన పోస్టులను ఇందులో చేర్చలేదు. మిగిలిన జిల్లాలలో నోటిఫికేషన్ జారీ, పోస్టుల భర్తీకి కేంద్ర ఎన్నికల కమిషన్ నుంచి అనుమతి తీసుకున్నారు. భర్తీప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపట్టనున్నట్టు ఎస్పీడీసీఎల్ ఒక ప్రకటనలో పేర్కొన్నది. జూనియర్ పర్సనల్ ఆఫీసర్, జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు సంబంధించి మూడు క్యాటగిరీల్లో మొత్తం 2,939 పోస్టులు ఉన్నట్టు తెలిపింది. ఒక్కో క్యాటగిరీ పోస్టులకు ఒక్కో నోటిఫికేషన్ చొప్పున మొత్తం మూడు నోటిఫికేషన్లు ఇచ్చినట్టు పేర్కొన్నది. ఇందులో జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) ఉద్యోగానికి ఐటీఐ (ఎలక్ట్రికల్) ఉత్తీర్ణతతోపాటు స్తంభం ఎక్కడం, జూనియర్ పర్సనల్ ఆఫీసర్ ఉద్యోగానికి ప్రథమశ్రేణి డిగ్రీ, జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్‌కు డిగ్రీతో పాటు పీజీడీసీఏ చేయాలనే అర్హతలను నిర్ణయించినట్టు తెలుస్తున్నది. ఈ పోస్టులకు ఇతర అర్హతలు, జిల్లాలవారీగా ఖాళీలు, రిజర్వేషన్లు, రిక్రూట్‌మెంట్ విధానం, నిబంధనలకు సంబంధించి పూర్తివివరాలు, నోటిఫికేషన్ల కోసం www.tssouthernpower.com వెబ్‌సైట్‌లోని కెరీర్ లింక్‌లోగానీ, http://tssouthernpower.cgg.gov.in లోగానీ చూడాలని తెలిపింది. ఈ పూర్తి వివరాలు, పూర్తి నోటిఫికేషన్లు అక్టోబర్ 10 నుంచి డిస్కం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని ఆ ప్రకటనలో పేర్కొన్నది.

**ఇప్పటికే 4,135 పోస్టుల భర్తీ**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రాష్ట్రంలోని విద్యుత్‌సంస్థలు భారీస్థాయిలో ఉద్యోగాలను భర్తీచేశాయి. ఇప్పటికే ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ డిస్కంల పరిధిలో 1,086 ఇంజినీరింగ్, 288 అకౌంట్స్, 2,761 ఓఅండ్ఎం పోస్టులు కలిపి మొత్తం 4,135 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇక వేలసంఖ్యలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వారికి ఉన్న స్కిల్స్‌నుబట్టి నాలుగు రకాలుగా వర్గీకరించి ఆర్టిజన్స్‌గా రెగ్యులరైజ్ చేయడం తెలిసిందే. రెండు డిస్కంలలోనే 14,668 మంది ఆర్టిజన్లు రెగ్యులరైజ్ అయ్యారు. వీటికి అదనంగా జెన్‌కో, ట్రాన్స్‌కో కూడా ఆర్టిజన్లతోపాటు క్యాటగిరీలవారీగా వందల సంఖ్యలో పోస్టులను భర్తీచేసింది. ఈ నేపథ్యంలో ఎస్పీడీసీఎల్ నుంచి దాదాపు 3 వేల పోస్టుల భర్తీకి ప్రకటన వెలువడటంతో దసరా పండుగ పదిరోజుల ముందుగానే వచ్చినట్టయిందని నిరుద్యోగులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.